సాక్షి తిరుపతి
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024




గడువు లోగా అర్జీలకు పరిష్కారం

గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. - 10లో



కల్పవృక్షంపై..రాజమన్నార్

తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై విహరించారు. - 10లో



బాబూ.. ఇదేం తీరు!

మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేయనీకుండా టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. మేం చెప్పిన వారే వేయాలంటున్నారు - 10లో

న్యూస్‌రీల్

పరశురామేశ్వర స్వామి ఆలయానికి టూరిజం బస్సు



భక్తులకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయానికి సోమవారం తిరుపతి నుంచి ఏపీ టూరిజం మొదటి బస్సు భక్తులతో చేరింది. తిరుపతి నుంచి తిరుచానూరు మీదుగా గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్త ప్యాకేజీ టూర్‌ను ప్రారంభించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తిరుపతిలోని శ్రీనివాసం నుంచి తొలిసారిగా టూరిజం బస్సు పరశురామేశ్వర స్వామి ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ గిరినాయుడు భక్తులకు పూల మాలలు వేసి మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి, పరశురామేశ్వర స్వామిని దర్శనం చేయించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,859 మంది స్వామివారిని దర్శించుకోగా 37,173 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.63 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

ముగిసిన రెండో విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీల్లో పీజీ సెట్–2024 రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఎస్వీయూలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ కోర్సుల్లో సుమారు 80 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. అలాగే మహిళా వర్సిటీలో అన్ని పీజీ కోర్సుల్లో 85 శాతానికి మించి అడ్మిషన్లు జరిగినట్లు సమాచారం. పీజీలో కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లను మూడో విడత కౌన్సెలింగ్ లేదా స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసే అవకాశం ఉంది. అలాగే ఐసెట్–2024కు సంబంధించి ఎస్వీయూలో ఎంబీఏ, ఎంసీఏ సీట్లు వందశాతం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

కృష్ణాలంకృతుడై.. తృష్ణవల్లభుడై..

ఓ పక్క రుక్మిణి.. మరో పక్క సత్యభామ నడుమ మురళీలోలుడు నవనీతచోరుడి రూపం ధరించి భక్తులకు కనువిందు చేశారు. స్వర్ణతేజోమయంగా కాంతులీనుతున్న సర్వభూపాల వాహనాన్ని అధిరోహించిన చిన్నికృష్ణుడు.. సకల భూపాలురకు తానే అధిపతినని.. తన భిక్షే రాజ్యాధికారమని సందేశమిచ్చారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మలయప్పస్వామికి ఉదయం కల్పవృక్షవాహన సేవ, రాత్రి సర్వభూపాల వాహన సేవలు తిరుమాడ వీధుల్లో భక్త జన నీరాజనాల మధ్య కనువిందుగా సాగాయి.

- సర్వభూపాల వాహనంపై మలయప్పస్వామి విహారం
- నేటి రాత్రి 6:30 గంటలకే గరుడ వాహన సేవ
- శ్రీవారికి శ్రీవిల్లిపుత్తూరు పుష్ప మాలలు, చెన్నై గొడుగుల సమర్పణ



గరుడ సేవ సందర్భంగా శ్రీవారి ఆలయం అలంకరణ



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న మలయప్ప స్వామి



తిరుమాడ వీధుల్లో కాళీయమర్దనుడిగా మలయప్ప స్వామి విహారం

తిరుమల: తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై ఉభయ దేవేరులు శ్రీదేవి, భూదేవితో సమేత మలయప్పస్వామి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భూపాలులందరికీ తానే భూపాలుడినని చాటుతూ శ్రీవారు సర్వ భూపాల వాహనం కొలువుదీరి సందేశమిచ్చారు. సాయం సంధ్యవేళలో ఆలయం వెలుపల ఉన్న కొలువు మంటపానికి స్వామివారిని వేంచేపు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకార సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులు వేయి నేతి దీపాల వెలుగులో ఊయలపై ఊగుతూ భక్తులకు దర్శనమిచ్చి, కనువిందు చేశారు. అనంతరం బంగారు, వజ్ర వైఢూర్య ఆభరణాలు, పుష్ప మాలలతో ఉత్సవర్లకు విశేష అలంకరణ చేసి సర్వభూపాలవాహనంపై కొలువుదీర్చారు. అశేష భక్తజనం గోవిందనామస్మరణలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ రాత్రి 7 గంటలకు ప్రారంభించిన సర్వభూపాల వాహన సేవ రాత్రి 9 గంటల వరకు నాలుగు మాడ వీధుల్లో సాగింది.



చెన్నై గొడుగులను అందజేస్తున్న ప్రతినిధులు




శ్రీవిల్లి పుత్తూరు మాలలకు పూజలు





వాహనసేవల ముందు సాంస్కృతిక ప్రదర్శనలు





6.30 కే గరుడ సేవ

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైన గరుడ వాహన సేవ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకే ప్రారంభించనున్నారు. ఇందుకోసం టీటీ డీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి నాలుగు రోజులు వాహన సేవల్లో జనం పలుచగా కనిపించారు. కాగా గరుడ వాహన సేవకు రెండున్నర లక్షల మందికిపైగా భక్తులు హాజరయ్యే అవకాశాలున్నాయని టీటీడీ అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయం చుట్టూ నిర్మించిన ఇన్నర్ సెక్యూరిటీ కారిడార్‌కు చెందిన మొత్తం 27 ప్రవేశాలు, వెలుపల మార్గాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఇప్పటికే 5,145 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. రాత్రి 6.30 గంటలకే గరుడవాహనసేవను ప్రారంభించి రాత్రి 11 గంటల వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తిరుమలలో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినం చేశారు. సోమవారం నుంచే తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో ద్విచక్ర వాహనాలు రాకపోకలను నిషేధించారు. తిరుపతిలో పలు ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు పోలీసులు చేశారు.

గరుడవాహన సేవకు ఏర్పాట్లు సిద్ధం

తిరుమల: శ్రీవారి గరుడ వాహనం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని టీటీడీ ఈఓ శ్యామల రావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తెలిపారు. టీటీడీ, విజిలెన్స్, పోలీసు విభాగాలు సమన్వయ సహకారంతో గరుడోత్సవాన్ని విజయవంతం చేస్తామన్నారు. స్వామివారు ఊరేగనున్న వాహన సేవలపై నాణేలు విసరొద్దని భక్తులకు ఈఓ విజ్ఞప్తి చేశారు. భక్తులు విసిరే నాణేలు, మిరియాలు, ఉప్పు వంటి పదార్థాలతో స్వామివారికి అలంకరించే పవిత్రమైన పురాతన ఆభరణాలు విరిగిపోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. వాహన సేవల ముందు వచ్చే హుండీల్లో మాత్రమే భక్తి శ్రద్ధలతో చిల్లర సమర్పించాలని కోరారు.

రాహు-కేతుల ప్రదక్షిణ!

'మూగజీవుల ముక్తిధామమైన శ్రీకాళహస్తి శైవక్షేత్రంలో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రత్యేకించి శ్రీకాళహస్తి క్షేత్రానికే పరిమితమైన రాహు-కేతు సర్పదోష నివారణ పూజల్లో పాల్గొనే భక్తులను దానం పేరుతో అర్చకులు దోచుకుతింటున్నారు. తాజాగా ఓ భక్తురాలు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రికి ఫిర్యాదు చేయడంతో ఓ అర్చకుడు, మరో ఆలయాధికారిని విధుల నుంచి తప్పించారు. అయినా సంభావనకు అలవాటు పడిన అర్చకులు వసూళ్ల పర్వాన్ని ఆపకపోవడం విమర్శలకు తావిస్తోంది. వీరికి ఆలయాధికారుల అండదండలు పుష్కలంగా ఉండడం, వాటాలు పంచుతుండడంతో మరింత రెచ్చిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- గత శనివారం రాహు-కేతు పూజలు చేయించుకున్న ఓ భక్తురాలిని ఏదో ఒక దానం చేయాలని అర్చకుడు డిమాండ్ చేశాడు. ఆమె తక్కువ నగదు ఇచ్చారని అర్చకుడు ఆగ్రహించి పూజలు చేయించుకున్న కుంకుమ ఆమె నెత్తిన కొట్టాడు. అదే భక్తురాలిని ఆలయం లోపలికి పంపకుండా బయట నుంచే ఏపీఆర్వో దర్శనం చేసుకోవాలని చెప్పాడు. భక్తురాలి నెత్తిన కుంకుమ చూసి విమానాశ్రయంలోకి వెళ్లనివ్వకుండా సిబ్బంది అడ్డుకున్నారు. ఆ సమయంలో అటు వెళుతున్న దేవదాయశాఖ మంత్రి రామనారాయణ రెడ్డికి ఆమె ఫిర్యాదు చేశారు. దేవదాయశాఖ మంత్రి ఆదేశంతో అర్చకుడిని, ఏపీఆర్వోను అదేరోజు సస్పెండ్ చేశారు.

.. ఇలా మోసపోతోంది ఆమె ఒక్కరే కాదు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో దోషనివారణ పూజలు చేసుకునే ప్రతి భక్తుడిదీ ఇదే పరిస్థితి. భక్తుల బలహీనతలను అవకాశంగా మలుచుకుని అర్చకులు, సిబ్బంది వేసే పాచికలకు భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఇలా వసూలు చేసిన మొత్తాన్ని వాటాలు పంచుకుని భక్తుల నెత్తిన శఠగోపం పెడుతున్నారు.

- రాహు-కేతు పూజలు చేసుకుంటే సంభావన ఇవ్వాల్సిందే
- గోదానం, భూదానం.. పేరిట నిలువు దోపిడీ
- అడిగినంత ఇవ్వని వారిపై దురుసు ప్రవర్తన
- అర్చకులు, సిబ్బంది కుమ్మక్కై అనధికారిక వసూళ్లు

రేణిగుంట : శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ దేవి రాహు, కేతువుల్లా వెలసినట్లు ఇక్కడి స్థల పురాణం చెబుతోంది. ప్రపంచంలో మరెక్కడా జరగని రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాత్రమే నిర్వహిస్తుంటారు. జాతకంలో రాహు-కేతు దోషాలు తొలగుతాయన్న విశ్వాసంతో దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు విదేశీయులు కూడా అధిక సంఖ్యలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి తరలివచ్చి రాహు-కేతు పూజలు చేసుకుని ముక్తి పొందుతుంటారు. ఇదే అదునుగా ఆలయంలోని అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది భక్తుల నుంచి దానం పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు.



ఆలయంలో రాహు-కేతు దోష నివారణ పూజలు

దోషం పోవాలంటే..సంభావనా ఇవ్వాలట!

ఆలయంలోని రాహు-కేతు మండపాల్లో పూజ చేసుకున్న తర్వాత దోషాలు తొలగిపోవాలంటే దానం చేయాలంటూ భక్తులను నమ్మబలకుతున్నారు. ఇంత వ్యయప్రయాసలకోర్చి చేసుకున్న దో ష పూజ పరిపూర్ణం కాకుంటే దోషాలు తొలగిపోవేమోనన్న భయాందోళనతో భక్తులు వారు అడిగిన సంభావన ముట్టజెప్పుతున్నారు. ఇక్కడ 25 ఏళ్ల కిత్రం రూ.30తో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలను ప్రారంభించారు. మహాశివరాత్రి ఐదు రోజులు తప్ప మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు రాహు-కేతు పూజలు చేస్తుంటారు. సాధారణంగా రోజుకు మూడు వేలు నుంచి రద్దీ రోజుల్లో 7వేలు పూజల వరకు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇలా సగటున నెలకు లక్షకు పైగా దోషపూజలు చేస్తుంటారు. ఏడాదికి ఈ పూజల ద్వారానే ఆలయానికి రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తుందంటే అతిశయోక్తి కాదేమో.

రాహు-కేతు పూజలు ఇలా

రూపాయలు	పూజ చేసే ప్రాంతం
రూ.500	శ్రీకృష్ణదేవరాయల మండపం
రూ.750	జ్ఞానాంబిక మండపం
రూ.1,500	ప్రసాదాల మండపం
రూ.2,500	కల్యాణోత్సవ మండపం
రూ.5,000	సహస్ర లింగం వద్ద

అడిగినంత ఇవ్వకుంటే ఛీత్కారాలే

రాహుకేతు పూజలు అయిన తరువాత స్వాములు ఆ పూజా ఫలం పూర్తిగా దక్కాలంటే పూజ చేయించిన వారికి గోదానం, భూ దానం, వస్త్రదానం ఏదో ఒక దానం ఇవ్వాలని అలా లేని పక్షంలో రూ.101 చెల్లించి మూడుసార్లు ఆత్మభ్రమణం చేసి తిరిగి చూడకుండా గుడిలోకి వెళ్లిపోవాలని సెలవిస్తుంటారు. అలా ఇవ్వని భక్తులపై అర్చకులు, ఆలయ సిబ్బంది తమ ప్రతాపాన్ని చూపిస్తుంటారు. ఛీత్కారాలు అటుంచితే అంతరాలయ దర్శనాలు లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలిసినా తమకు వాటాలు అందుతుండడంతో మిన్నకుంటున్నారన్న విమర్శలున్నాయి.

మాకు అక్కడే డ్యూటీ కావాలి

ఆలయానికి వచ్చే రాబడికి మించి రాహు-కేతు పూజా మండపాల్లో పనిచేసే సిబ్బంది అక్రమ వసూళ్లు చేస్తున్నారు. ఉద్యోగులంతా ఆయా మండపాల్లో డ్యూటీల కోసం పోటీపడుతుంటారు. కొందరైతే రాజకీయ పలుకుబడి, అదీ కుదరకుంటే పైస్థాయి అధికారులకు లంచాలిచ్చి డ్యూటీలు వేయించుకుంటుంటారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు

ఎవరినైనా దానం చేయాలని అడిగితే చర్యలు తీసుకుంటామని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ అధికారులు, అర్చకులను హెచ్చరించారు. ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే తనకు ఫిర్యాదు చేయాలని ఈఓ భక్తులకు సూచించారు. ఆలయంలోని మండపాల్లో తన సెల్‌ఫోన్ నంబర్ కూడా బోర్డులో ఉంచానన్నారు. ఎటువంటి ఇబ్బంది కలిగినా తనకు నేరుగా ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.





తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.78,100
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.95,000
రిటైల్ వెండి గ్రాము	రూ.98.00

క్లుప్తంగా

దళితుల భూములు కబ్జా



ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దళిత రైతులు

శ్రీకాళహస్తి: కేవీబీపురం మండలం కాళంగి గ్రామానికి చెందిన దళిత రైతులు తమ భూములు కబ్జా చేశారని శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 1962లో పక్కా సెటిల్‌మెంట్ శ్రీకాళహస్తి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రికార్డు అయి ఉందన్నారు. అయితే ఆ భూములను కొంతమంది ఆక్రమించి బెదిరిస్తున్నారని అధికారులకు విన్నవించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శేఖర్, వెంకటకృష్ణ, రోశయ్య, గిరి, వీరాస్వామి, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్షంపై..రాజమన్నార్ రాజసం

- సర్వభూపాలునిపై కల్యాణ వెంకన్న అభయం
- ప్రత్యేక ఆకర్షణగా దేవతామూర్తుల కళారూపాలు
- భక్తి ప్రపత్తులతో సారె తీసుకొచ్చిన పల్లె ప్రజలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం ఉదయం శ్రీ రాజమన్నార్ అలంకారంలో శ్రీనివాసుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు స్వామి వారు గ్రామంలో విహరిస్తూ కనువిందు చేశారు. వాహనం ముందు చెక్క భజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి వాహనసేవ కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి ఊంజల్‌సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి సర్వభూపాల వాహనంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారు ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు.

ఆకట్టుకున్న కళారూపాలు

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో దేవతామూర్తుల రూపాలతో వేషధారణ చేసుకున్న కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులు వారితో సెల్ఫీలు తీసుకుని భక్తితో నమస్కరించి వెళుతున్నారు.



కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అవతారంలో కల్యాణ వెంకన్న



సర్వభూపాల వాహనంపై కల్యాణ వెంకన్న, వాహనం మోస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భక్తితో వచ్చి.. సారె సమర్పించి!

బ్రహ్మోత్సవాలకు తిరుపతి రూరల్ మండలం అవిలాల, లింగేశ్వరనగర్, సాయినగర్, గాంధీపురం, పేరూరు, తుమ్మల గుంట పంచాయతీలతో పాటు ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన పలు పంచాయతీల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తితో సారె తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సారె తెచ్చిన భక్తులను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గరుడ వాహన సేవకు భారీ ఏర్పాట్లు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు మంగళవారం రాత్రి గరుడవాహన సేవకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తుమ్మలగుంట గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, తిరుపతి నగరం నుంచి ఎక్కువ మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో ఆ మేరకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. గరుడ వాహన సేవలో ప్రముఖులు కూడా పాల్గొనే అవకాశం ఉన్నందున అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు

గరుడ వాహన సేవను పురస్కరించుకుని తుమ్మలగుంట గ్రామానికి వచ్చే అన్ని దారులలో ఆంక్షలు విధించారు. ఇప్పటికే వాహనాల పార్కింగ్.. వాహనాల దారి మళ్లింపు విషయాలపై ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గ్రామ పెద్దలతో చర్చించారు. టీటీడీ డెయిరీ ఫాం వద్ద జాతీయ రహదారిపై నుంచి వచ్చే భక్తులు ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న మఠం భూమిలో వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అలాగే ఉప్పరపల్లి ప్రాంతం నుంచి వచ్చే వాహనాలు వరరూప అపార్ట్‌మెంట్ వద్ద ఖాళీ స్థలంలో పార్క్ చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అందించిన దానికంటే అదనంగా తాగునీరు, భోజన వసతి సౌకర్యాలు కూడా కల్పించాలని చెవిరెడ్డి ఆలయ సిబ్బందికి సూచించారు.



సిద్ధమైన గరుడ వాహనం

కండలేరులో గల్లంతైన యువకుడి మృతి



చెంచయ్య మృతదేహం



పంతగిరి చెంచయ్య(ఫైల్)

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం రాత్రి చేపల వేటకు వెళ్లి, గల్లంతైన మండలంలోని ఓబులాయిపల్లి గిరిజనకాలనీకి చెందిన పంతగిరి చెంచయ్య(27) సోమవారం విగతజీవిగా దొరికాడు. స్థానికుల కథనం మేరకు.. ఓబులాయిపల్లి గిరిజన కాలనీకి చెందిన పంతగిరి చెంచయ్య ఆదివారం చేపల వేటకు కండలేరు జలాశయానికి వెళ్లాడు. రాత్రివరకు రాకపోవడంతో అతని కోసం మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. అతను వెళ్లిన తెప్ప బోర్లపడి ఉండడంతో చెంచయ్య జలాయశంలో పడి ఉంటాడని అనుమానించారు. రాత్రి కావడంతో సోమవారం తెల్లవారుజాము నుంచి గాలింపు చర్యలు చేపట్టడంతో చెంచయ్య మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. చెంచయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు మృతదేహన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు, చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోడకూలి బాలికకు గాయాలు

నారాయణవనం: మండలంలోని ఎగువబొప్పరాజుపాళ్యంలో ఆలయ ప్రహరీ గోడ కూలి రచన(9) తీవ్ర గాయాలతో తిరుపతి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రచన తండ్రి బాలాజీ కథనం మేరకు.. గ్రామంలోని గ్రామదేవత ఆలయ ప్రహరీగోడ వర్షాలకు నాని కూలే పరిస్థితిలో ఉంది. ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి రచన ఆలయ ప్రాంగణంలో ఆడుతున్న సమయంలో ప్రహరీగోడ కూలింది. ఈ ప్రమాదంలో రచనకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బాలికను తిరుపతి రుయాస్పత్రికి తరలించినట్లు బాలాజీ తెలిపారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం
వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.



మీ ఉన్నతికై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సమాచారం తెలియజేసే అవకాశం.

సాక్షి — ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్

సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థకూడిక తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.

SAKSHI ✆ 99122 20586, 9951602971
Mail id: tptadvtsakshi@gmail.com

బాబూ.. ఇదేం తీరు



మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయనీకుండా బెదిరింపులు.. తాము చెప్పిన వారే చేయాలని హుకుం.. కాదని దరఖాస్తు చేస్తే చుక్కలు చూపించేందుకు రంగం సిద్ధంతో తిరుపతి జిల్లాలో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియలో కూటమి కుట్ర బట్టబయలైంది. తమకు అడ్డే ఉండకూడదని తెలుగు తమ్ముళ్లు, ప్రజాప్రతినిధులు మద్యం దుకాణాల వ్యవహారంలో తలదూరుస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు.

లిక్కర్ టెండరింగ్‌కు కూటమి కుట్ర

- మద్యం షాపులకు దరఖాస్తు చేయనీకుండా అడ్డగింత
- ఎమ్మెల్యేలు చెప్పిన వారే టెండర్లు వేయాలి
- కాదని ఆన్‌లైన్‌లో టెండర్లు వేయడానికి వీల్లేదు
- టెండర్‌లో మద్యం షాపు దక్కించుకున్నా లాక్కుంటాం
- ఆన్‌లైన్‌లో టెండర్లు వేసేవారికి కూటమి నేతల హెచ్చరికలు

నేను చెప్పేది వినండి. ఏ షాపునకు ఎవరనేది నేను డిసైడ్ చేశా. ఆ షాపునకు వారు మాత్రమే టెండర్ వేయాలి. వేరే వాళ్లు వేయటానికి వీల్లేదు. టెండర్లు దక్కించుకున్న వారు.. మద్యం దుకాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రతి రోజూ షాపు మూశాక.. నా వాటా నా ఇంటికి చేరాలి. మద్యాన్ని ఎంతకు అమ్ముకున్నా నాకు అభ్యంతరం లేదు'

– తూర్పు ప్రాంత నియోజక వర్గానికి చెందిన ఓ ఎమ్మెల్యే హుకుం

నాలుగు నియోజక వర్గాల్లోని మద్యం దుకాణాలన్నీ మన చేతుల్లోనే ఉండాలి. వేరేవారు ఎవరైనా టెండర్ వేసి దక్కించుంటే.. వాడిని పిలిచి లాక్కోండి. అలా కాదని వాడు టెండర్ ద్వారా షాపు దక్కించుని దుకాణం ప్రారంభిస్తే.. పక్కనే పోటీగా మనవాడితో వైన్ షాపు ప్రారంభించమని చెప్పండి. మనల్ని కాదని దుకాణం దక్కించుకున్న వాడికి రోజూ చుక్కలు చూపించండి. వాడంతట వాడే పారిపోయేలా చెయ్యండి.

– తూర్పు నియోజక వర్గానికి చెందిన ఎమ్మెల్యే, బడా పారిశ్రామిక వేత్త ఆదేశం

తిరుపతి నగరంలో పదిహేను దుకాణాలు నాకు ఇచ్చేయండి. ఎన్నికల్లో మేమే ఖర్చుచేశాం. ఆ డబ్బులు సంపాదించుకోవాలి. మిగిలిన షాపులు ఎవరైనా తీసుకోండి.. నాకు అభ్యంతరం లేదు.

– తిరుపతిలో కూటమి నేత డిమాండ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మద్యం దుకాణాలు కూటమి నేతలు దక్కించుకునేందుకు రంగంలోకి దిగారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పి వారే టెండర్లు వేసేలా హుకుం జారీ చేశారు. ఎమ్మెల్యేలను కాదని ఎవరైనా ఆన్‌లైన్‌లో టెండర్లు వేస్తే.. వారిని పిలిపించి బెదిరింపులకు దిగుతున్నారు. బెదిరించినా వినకుండా ఆన్‌లైన్ ద్వారా మద్యం దుకాణం దక్కించుకుంటే.. ఆ వ్యాపారికి చుక్కలు చూపించటానికి రంగం సిద్ధం చేశారు. జిల్లాలో 227 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రైవేటు వారికి అప్పగిస్తుండడంతో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు అనేక మంది ప్రయత్నం చేశారు. అయితే టీడీపీ ఎమ్మెల్యేలు మద్యం వ్యాపారుల ఆశలపై నీళ్లు చల్లారు. తాము చెప్పిన వారు మాత్రమే మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలని హుకుం జారీ చేశారు. ఆన్‌లైన్ టెండర్ వేసేందుకు ప్రయత్నం చేసిన వారిని పిలిపించి మరీ బెదిరించినట్లు విశ్వసనీయ సమాచారం. దాంతో జిల్లా వ్యాప్తంగా 227 దుకాణాలకు ఇప్పటి వరకు 613 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ విషయం పరిశీలిస్తే ఎమ్మెల్యేలను ఎదురించి దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఉన్నారు. వాస్తవంగా అయితే దుకాణానికి 10 నుంచి 20 దరఖాస్తులు రావాల్సి ఉంది. వాకాడు, కోట, చిట్టమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14 దుకాణాలకు నోటిఫికేషన్ ఇస్తే.. ఇప్పటి వరకు కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు సమాచారం.

దరఖాస్తులు అధికంగా రాకపోవడం వెనుక..

జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా దరఖాస్తులు రావాల్సి ఉన్నా.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, హెచ్చరికల నేపథ్యంలో తక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాలు కావాలనుకున్న వారు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనేది నిబంధన. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం తెలియని కొందరు వ్యాపారులు ఎక్సైజ్ కార్యాలయానికి నగదుతో వెళుతున్నారు. పరిచయం ఉన్న వారివి ఆన్‌లైన్ చేస్తే.. పరిచయం లేని వారివి మాత్రం ఆన్‌లైన్ చేయకుండా సర్వర్ సమస్య అని తిప్పి పంపేస్తున్నారు. అటువంటి వారి వివరాలను అధికారపార్టీ నాయకులకు సమాచారం ఇచ్చి ఆ వ్యాపారులపై ఒత్తిడి చేయిస్తున్నారు.

తిరుపతిలో మద్యం దుకాణాల కోసం పోటీ

జిల్లా అంతటా ఒక ఎత్తైతే.. తిరుపతి నగరంలో మాత్రం మద్యం దుకాణాలకు విపరీతమైన పోటీ నెలకొంది. కూటమి నేతలు హెచ్చరిస్తున్నా.. వ్యాపారులు మాత్రం తగ్గేదే లేదంటూ ఎవరికి వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నారు. నగర పరిధిలో 32 దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇస్తే.. సోమవారం రాత్రి ఏడుగంటల వరకు 230 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారానికి మరో 300 దరఖాస్తులు వేసే అవకాశం ఉన్నట్లు అంచనా.

కూటమి నేతల కుట్రలు

నగరంలో ఎవరు ఎన్ని దరఖాస్తులు చేసుకున్నా.. చివరకు కూటమి నేతలకు మాత్రమే దుకాణాలన్నీ దక్కే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖలోని ఓ అధికారి స్పష్టం చేశారు. అదెలా అంటే.. దరఖాస్తుల పరిశీలనలో ఏదో ఒక పేపర్ లేదని లేదా ఏదో ఒక కారణం చూపి, అనర్హులుగా తొలగించేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందుకోసం సంబంధిత అధికారులపై అమరావతి నుంచి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఇదంతా చూస్తే.. కూటమి నేతలను కాదని ఎవరు దరఖాస్తు చేసుకున్నా.. దరఖాస్తు కోసం చెల్లించిన నగదు వృథా అవుతుందని ముందే కొందరిని హెచ్చరించినట్లు నగరంలో ప్రచారం జరుగుతోంది.

మిగిలింది ఒక్కరోజే..

మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 9వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనుంది. ఆఖరు రోజు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెద్ద ఎత్తున వస్తే సర్వర్ పనిచేయక సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందు కోసం దరఖాస్తు చేయాలనుకున్న వారంతే ఈ రోజే వేసే అవకాశం ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

PLOTS FOR SALE
■ దసర ఆఫర్ : నెల్లూరుసిటీ, గూడూరులో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు Ready గా ఉన్న మా లేఅవుట్‌లో లోను వసతి మరియు ఫ్రీ రిజిస్ట్రేషన్ ఆఫర్‌తో ప్లాట్లు అమ్మబడును. 79954 34866.

Wanted

■ ప్రముఖ Govt (R) కి మండలాల వారీగా పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్స్ మేనేజర్స్ కావలెను. అ:10th డిగ్రీ పీజీ జీ:18000 - 26000 ట్రైనింగ్ ఇవ్వబడును.✆8008830057.

■ తిరుపతిలోని ప్రముఖ కాలేజీనందు పనిచేయుటకు Watchmans,వంట మనుషులు, Wardens & PRO's కావలెను. జీతం+ భోజన వసతి కల్పించబడును.6303316571.

■ శ్రీ వీరభద్ర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ, పుంగనూరు నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు LPG సిలిండర్లు డెలివరీ చేయుటకు త్రీ వీలర్ ఆటో డ్రైవర్లు కావలెను. సొంత ఆటో ఉండి డెలివరీ ఇచ్చు వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ✆ 9246846892.

■ నైల్ లిమిటెడ్, లెడ్ రీసైక్లింగ్ ప్లాంట్ గాజులమండ్యం నందు Lab Assistant కొరకు B.Sc (Chemistry) సర్టిఫికెట్ గల అభ్యర్థులు కావలెను. సంప్రదించ: 9177689818, karthik@nilelimited.com

■ తిరుపతి టౌన్‌లో గల స్కూల్స్, కాలేజీల్లో వాచ్‌మెన్ (Watch Men) గా పనిచేయుటకు భార్యభర్తలు-10 కావలెను. జీతం: 20,000, రూం + భోజనం ఫ్రీ. ✆ 9908281928.

■ Couple's Matrimony, Tirupati నందు పనిచేయుటకు అనుభవం కల్గిన Tele Callers కావలెను. Qul: Any డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం. ✆ 9676737633, 9100445334.

■ వైభవ్ హోటల్, రేణిగుంట నందు పనిచేయుటకు అనుభవం గల కంప్యూటర్ నాలెడ్జ్ గల క్యాషియర్ (లేడీస్/జంట్స్). ✆ 9182282880.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818882.

■ కష్టమైన్నా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ. 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD.8817512185

వాలుగిల్లిన్న ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డీఆర్‌డీఏను గాడిలో పెడతాం

- వెంకన్న పాదాల చెంత అవకాశం అదృష్టం
- డీఆర్‌డీఏ పీడీగా శోభనబాబు



కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసిన డీఆర్‌డీఏ పీడీ టీఎన్ శోభనబాబు

తిరుపతి అర్బన్: డీఆర్‌డీఏలో లోటుపాట్లును సవరించి, గాడిలో పెడతామని ఆ ప్రాజెక్టు డైరెక్టర్ టీఎన్ శోభనబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన తిరుపతిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నగరి క్లస్టర్ డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న టీఎన్ శోభనబాబును తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. పీడీగా పనిచేస్తున్న జ్యోతి రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి జిల్లా ఇన్‌చార్జిల పాలనలోనే నడుస్తోంది. తాజాగా టీఎన్ శోభనబాబును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. నిత్యం అందరికి అందుబాటులో ఉంటామన్నారు. అందరి సహకారంతో మహిళా సంఘాల అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. వెంకన్న పాదాల చెంత పనిచేసే భాగ్యం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

నన్నే బిల్లు కట్టమంటావా?

– విద్యుత్ లైన్‌మన్‌పై టీడీపీ కార్యకర్త దాడి

తిరుపతి రూరల్: విద్యుత్ బిల్లు చెల్లించాలని కోరిన లైన్‌మన్‌పై టీడీపీ కార్యకర్త దాడికి పాల్పడిన ఘటన సోమవారం తిరుపతిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చంద్ర విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆయన సోమవారం భవానీనగర్‌లో టీడీపీ కార్యకర్త శ్రీనాథ్ ఇంటి వద్దకు వెళ్లి విద్యుత్ బిల్లు చెల్లించాలని కోరాడు. మద్యం మత్తులో ఉన్న శ్రీనాథ్ ఒక్కసారిగా పరుష పదజాలంతో దుర్భాషలకు దిగాడు. ×నన్నే విద్యుత్ బిల్లు చెల్లించాలని అడుగుతావా¥..? అంటూ బూతు పురాణం మొదలు పెట్టాడు. ఉద్యోగితో ఇలా ప్రవర్తించడం సరికాదంటూ చంద్ర వాదించడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన శ్రీనాథ్ అతనిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో చుట్టుపక్కల వాళ్లు తీవ్ర భయాందోళను గురయ్యారు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు శ్రీనాథ్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు స్టేషన్‌కు చేరుకుని బాధిత లైన్‌మన్, శ్రీనాథ్ మధ్య పంచాయితీ చేసినట్లు సమాచారం.

గడువు లోగా అర్జీలకు పరిష్కారం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా వస్తున్న అర్జీలను గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా 200 అర్జీలు వచ్చాయి. అందులో 136 అర్జీలు రెవెన్యూ సమస్యలపై అందించారు. ఇదిలావుండగా అర్జీదారులకు సరైన వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్టీసీ సర్వీసు కూడా లేకపోవడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, దేవేంద్రరెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యా పింఛన్ ఇప్పించండి



మాది కల్యాణపురం ఎస్టీకాలనీ, పుత్తూరు మండలం. నేను రెండు నెలలుగా పింఛన్ కోసం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వచ్చిపోతున్నా. అయినా నాకు పింఛన్ మంజూరు కాలేదు. రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. ఎస్టీ కులానికి చెందిన నాకు జీవనాధారం ఏదీ లేదు. దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోండి. లేదంటే బతకడం కష్టం. –ప్రభాకర్, దివ్యాంగుడు

పిల్లలను హాస్టల్స్‌లో చేర్పించండి



నా పేరు గురవమ్మ. మాది దర్బావారి కండ్రిగ గ్రామం, కేవీబీపురం మండలం. నాకు ఐదుగురు పిల్లలు. నా భర్త శ్రీనివాసులు తాగుబోతు. రూ.2 లక్షలకు పైగా అప్పు చేశాడు. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే కుటుంబం మాది. మా బిడ్డలను చదివించడం భారంగా ఉంది. హాస్టల్స్‌లో చేర్చడానికి సాయం చేయండి.

–గురవమ్మ, ఐదుగురు పిల్లల తల్లి

నా కుమారుడుకి పింఛన్ మంజూరు చేయండి



నా పేరు ఏ.శేఖర్. నా కుమారుడు ఏ.హరీష్. మాది పుత్తూరు మండలం, కల్యాణపురం ఎస్టీ కాలనీ. మా బిడ్డ పుట్టుకతోనే వికలాంగుడు. బిడ్డ వైద్య ఖర్చుల కోసం ప్రతి నెల రూ.7 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అప్పుల బాధలతో ఇబ్బందులు పడుతున్నాం. మా బిడ్డకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి. – ఏ.హరీష్ తల్లిదండ్రులు

చంద్రన్న బీమా ఇవ్వడం లేదు సార్



మాది నాయుడుపేట. మా తమ్ముడు గోవర్ధన్ మృతి చెందాడు. నామినీగా నేనున్నాను. మేము చంద్రన్న బీమా రూ.5లక్షలకు అర్హులం. అయితే మాకు చంద్రన్న బీమా ఇవ్వడం లేదు. మీరైనా ఇప్పించి న్యాయం చేయండి సార్.

–పెంచలమ్మ, నాయుడుపేట

సెక్యూరిటీ టెండర్ వేస్తే చంపేస్తాం

- మాజీ సైనికోద్యోగిపై దౌర్జన్యం
- ఫోన్ లాక్కున్న టీడీపీ నేతలు
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటీ టెండర్ సమర్పించడానికి వచ్చిన ఓ మాజీ సైనికోద్యోగిని ఆరుగురు ఎమ్మెల్యే అనుచరులు అడ్డుకుని అతనిపై దౌర్జన్యంచేసి ఫోన్ లాక్కున్నారు. గత ఏప్రిల్‌లో ముగిసిన సెక్యూరిటీ టెండర్‌ను ఎమ్మెల్యే అనుచరులు దక్కించుకోవాలని గతంలో ఉన్న టెండరుదారుడు సెంట్రల్ కమాండ్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు కొనసాగింపుగా ఇచ్చారు. ఆ సంస్థ పీఎఫ్, ఈఎస్ఐ కట్టలేదనే ఆరోపణలతో కోర్టు విచారణలో ఉన్నా వారినే కొనసాగించారు. పదిరోజుల క్రితం పేపర్లో ప్రకటన ఇచ్చి టెండర్ ఆహ్వానించారు. ఎమ్మెల్యే అనుచరులు దీనిపై కన్నేసి ఎవరూ టెండర్ వేయకూడదని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో సోమవారం చివరి రోజు మయూరి సెక్యూరిటీస్ సంస్థకు చెందిన కిషోర్ అనే మాజీ సైనికోద్యోగి టెండర్ వేసి సీడీ ఫైల్ వ్యక్తిగతంగా ఇచ్చేందుకు ఆలయానికి వచ్చారు. ముందుగానే సన్నద్ధంగా ఉన్న ఎమ్మెల్యే అనుచరులు కిషోర్‌ను అడ్డుకున్నారు. అతనిమీద దౌర్జన్యం చేసి, ఫోన్ లాక్కున్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో టెండర్ వేయాలంటే ఎమ్మెల్యే అనుచరుల అనుమతి తప్పనిసరనని అని ఈ సంఘటనతో మరోసారి చెప్పకనే చెప్పారు.

అందరి ముందే దౌర్జన్యం చేశారు

ఇలాంటి దుర్ఘటన నా జీవితంలో చూడలేదు. ఆలయ సూపరింటెండెంట్ రవి, సెక్యూరిటీ సిబ్బంది, హోంగార్డులు, పోలీసులు అందరూ చూస్తుండగానే నాపై దౌర్జన్యం చేశారు. దీనిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తా. ఈవోకు దీనిపై సమాచారం ఇచ్చాను. ఆయన అందుబాటులో లేకపోవడంతో విజయవాడ దేవదాయశాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తా. ఈ దుర్ఘటనపై ఆలయ సీసీ పుటేజీ పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలి.

– మాజీ సైనికోద్యోగి కిషోర్